క్లుప్తంగా

బీబీపాటిల్ నామినేషన్‌కు తరలిన నాయకులు



భిక్కనూరు : జహీరాబాద్ పార్లమెంటరీ బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బీబీ పాటిల్ నామినేషన్ కార్యక్రమానికి భిక్కనూరు మండలం నుంచి బీజేపీ శ్రేణులు సోమవారం భారీగా తరలివెళ్లారు. మండల ఇన్‌చార్జి శ్రీధర్‌రెడ్డి, మండలాధ్యక్షుడు ఉప్పరి రమేష్ ఆధ్వర్యంలో బీజేపీ నేతలు కార్యకర్తలు వాహనాల్లో సంగారెడ్డికి వెళ్లారు. తరలి వెళ్లిన వారిలో బీజేపీ నేతలు అత్తెల్లి తిర్మలేష్, నరేందర్‌రెడ్డి, మల్లేష మల్లారెడ్డి తదితరులున్నారు.

ఎల్లారెడ్డి నుంచి..



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి మండలానికి చెందిన బీజేపీ నాయకులు సోమవారం సంగారెడ్డి సభకు తరలివెళ్లారు. బీజేపీ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థిగా బీబీ పాటిల్ నామినేషన్ కార్యక్రమంతో పాటు కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ సభకు హాజరయ్యేందుకు వారు తరలివెళ్లారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి



కామారెడ్డి అర్బన్ : ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని పీఆర్‌టీయూ (తెలంగాణ) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ మనోహర్‌రావు, జే లక్ష్మీరాజం సోమవారం జిల్లా ట్రెజరి అధికారి జి సాయిబాబుకు వినతిపత్రం అందజేశారు. ఉపాధ్యాయుల సరెండర్ బిల్లులు, పీఆర్‌సీ, డీఏ బకాయిలు, మెడికల్ ఇతర బిల్లులు చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్నట్టు జిల్లా ట్రెజరి అధికారికి వివరించారు. పాత బిల్లులు కొన్ని ఆటోమెటిక్‌గా రీజనరేట్ అయ్యే విధంగా చూడాలని వారు విజ్ఞప్తి చేశారు.

కాంగ్రెస్‌లో చేరిన గౌడ సంఘం నాయకులు



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : ఎల్లారెడ్డి మండలంలోని వెల్లుట్లపేట గ్రామానికి చెందిన గౌడ సంఘం నాయకులు సోమవారం ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. గౌడ సంఘం నాయకులకు ఎమ్మెల్యే పార్టీ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో సాయాగౌడ్, విఠల్‌గౌడ్, రాజాగౌడ్, గణపతి తదితరులు పాల్గొన్నారు.

బాన్సువాడలో..



బాన్సువాడ : బాన్సువాడ పట్టణానికి చెందిన బీఆర్‌ఎస్ మైనార్టీ యువకులు సోమవారం బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. బీఆర్‌ఎస్ పట్టణ యూత్ అధ్యక్షులు యూనూస్ ఆధ్వర్యంలో 75 మంది మైనార్టీ యువకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు అంజాద్ ఖాన్, లయక్, అక్బర్, బాడి శ్రీనివాస్ తదితరులున్నారు.

కాంగ్రెస్ విజయానికి కృషి చేయాలి



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని ప్రతీ కాంగ్రెస్ కార్యకర్త బాధ్యతగా 50 ఓట్లు చేతి గుర్తుకు వేయించాలని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు సూచించారు. సోమవారం ఆయన లింగంపేట మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. బీజేపీ వైఫల్యాలు, బీబీ పాటిల్ బిజినెస్ పాటిల్‌గా చేసిన అక్రమాలను ప్రజలకు వివరించాలన్నారు. బీజేపీ బీబీ పాటిల్‌కు టికెట్ అమ్ముకుందని ఆరోపించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు నారాగౌడ్, సుప్పాల రాజు, ఫతియోద్దీన్, ఎల్లమయ్య, రఫీక్, ఏదుల్ తదితరులున్నారు.

అంజన్న ఆలయాలు ముస్తాబు

- నేడు హనుమాన్ జయంతి
- శోభాయాత్రలకు ఏర్పాట్లు



మద్నూర్‌లోని సలాబత్‌పూర్ హనుమాన్ ఆలయంలో ఏర్పాట్లు

మద్నూర్(జుక్కల్) : మండలంలోని సలాబత్‌పూర్ హనుమాన్ ఆలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. మంగళవారం హనుమాన్ జయంతిని పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా తాగు నీరు, దర్శనానికి బారికెట్లు ఏర్పాటు చేశారు. హనుమాన్ జయంతి సందర్భంగా జాతర కోసం వివిధ ప్రాంతాల నుంచి ప్రత్యేక దుకాణాలు వెలిశాయి. ప్రతి సంవత్సరం జరిగే హనుమాన్ ఉత్సవాలకు మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తుండటంతో ఆలయ ధర్మకర్తల ఆధ్వర్యంలో పూర్తి ఏర్పాట్లు చేశారు. బుధవారం ఆలయ ఆవరణలో కుస్తీ పోటీలు నిర్వహించనున్నారు. జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు నేడు ఆలయంలో వేకువజామున ప్రత్యేక పూజలు చేయనున్నారు.

పట్టణంలో..

కామారెడ్డి అర్బన్ : పట్టణంలోని దేవునిపల్లి శ్రీఅంజనేయస్వామి ఆలయం ప్రాంగణంలో మంగళవారం ఉదయం 7గంటల నుంచి హనుమాన్ విజయోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు బి.శ్రీనివాస్‌రావు తెలిపారు. అలాగే మంగళవారం పున్నమి సందర్భంగా శ్రీరమా సత్యనారాయణ స్వామి సన్నిధిలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు, అన్నప్రసాదం నిర్వహిస్తారని శ్రీనివాస్‌రావు పేర్కొన్నారు.

తాడ్వాయిలో..

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలో మంగళవారం శ్రీరామసేన ఆధ్వర్యంలో నిర్వహించే శోభాయాత్రను విజయవంతం చేయాలని శ్రీరామసేన సభ్యులు తెలిపారు. హనుమాన్ జయంతి సందర్భంగా శ్రీరాముడు, హనుమంతుడి భారీ కటౌట్లను వాహనాల్లో ఉంచి శబరిమాత ఆశ్రమం నుంచి కామారెడ్డి–ఎల్లారెడ్డి ప్రధాన రహదారి గుండా గ్రామంలో ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. అనంతరం హనుమాన్ ఆలయం వద్ద అన్నదానం ఉంటుందన్నారు.

'ఆర్కిడ్స్'లో గ్రాడ్యుయేషన్ డే



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రిన్సిపల్

కామారెడ్డి రూరల్ : పట్టణంలోని ఆర్కిడ్స్ హై స్కూల్‌లో గ్రాడ్యుయేషన్ డేను సోమవారం చైర్మన్ అండ్ ప్రిన్సిపాల్ సీహెచ్ గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ఈ వేడుక కేవలం విద్యా విషయక విజయాల వేడుక మాత్రమే కాదని నేర్చుకోవడం, వృద్ధికి సంబంధించిన కొత్త అధ్యయనం అని పేర్కొన్నారు. ఈ వేడుకల్లో భాగంగా యూకేజీ పూర్తి చేసుకున్న విద్యార్థులకు యాజమాన్యం చేతుల మీదుగా కాన్వొకేషన్ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌కే గ్రూప్ ఆఫ్ సీఈవో ఎం జైపాల్‌రెడ్డి, డైరెక్టర్ ఎం సదాశివరెడ్డి, ఆర్‌కే డీన్ నవీన్‌కుమార్ తదితరులున్నారు.

స్కూల్ బస్సు ప్రారంభం



కామారెడ్డి టౌన్ : జిల్లా కేంద్రంలోని సరస్వతి శిశుమందిర్ పాఠశాల నూతన బస్సును మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ సోమవారం జెండా ఊపి ప్రారంభించారు. పాఠశాల అధ్యక్షుడు డాక్టర్ శ్యాంసుందర్‌రావు, ఉపాధ్యక్షుడు అశోక్‌రావు, ప్రతినిధులు ఎస్ఎస్‌చారి, గోపాలకృష్ణ, హెచ్‌ఎం నాగభూషణం, నగేష్ ఉన్నారు.

'బీడీ' వేతనాలు పెంచాలి

దోమకొండ : బీడీ కంపెనీలో పనిచేస్తున్న కార్మికులకు వెంటనే 40 శాతం వేతనాలను పెంచాలని తెలంగాణ నూతన బీడీ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివంది సత్యం అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని దేశాయి బీడీ కంపెనీలో కార్మికులతో ఆయన మాట్లాడారు. అదేవిధంగా నెలసరి ఉద్యోగులకు నెలకు రూ. 3 వేల చొప్పున పెంచాలన్నారు.

భిక్కనూరులో సామాజిక తనిఖీ



ప్రజావేదికలో మాట్లాడుతున్న అధికారి

భిక్కనూరు : మండలకేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ పథకం సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. మండలంలోని 18 గ్రామ పంచాయతీల పరిధిలో గత ఏడాది ఏప్రిల్ ఒకటి నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు చేపట్టిన ఉపాధిపనులపై ప్రజావేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ వామనరావు, విజిలెన్స్ అధికారి దత్తాత్రేయ, ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఏపీవో రాధిక, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన



రామారెడ్డి : సదాశివనగర్ మండల కేంద్రంలో అయ్యప్ప స్వామి ఆలయంలో సోమవారం ధ్వజస్థంభం ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయానికి వచ్చిన ఎమ్మెల్యేకు ఆలయ కమిటీ సభ్యులు ఘనస్వాగతం పలికారు. ఎమ్మెల్యే మదన్‌మోహన్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

లక్ష్మీవేంకటేశ్వరాలయంలో జీర్ణోద్ధరణ



భిక్కనూరు : మండలంలోని తిప్పాపూర్ గ్రామంలోని అతిపురాతనమైన లక్ష్మీ వేంకటేశ్వరాలయం జీర్ణోద్ధరణ మహోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. విష్వక్సేన ఆరాధన, వాసుదేవ పుణ్యాహవాచనం తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

ఆలయ నిర్మాణం కోసం భూమి పూజ



రాజంపేట : రాజంపేట మండలం పొందుర్తి గ్రామంలో సోమవారం మడి ఎల్లయ్య ఆలయ నిర్మాణం కోసం గ్రామ రజక సంఘం ఆధ్వర్యంలో భూమి పూజ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ తాటిపాముల బాలరాజ్, నాయకులు గౌడ్ గరుగుల బాబు, సెక్రటరీ రాజు తదితరులున్నారు.

ముగిసిన సప్తాహం



బాన్సువాడ రూరల్ : మండలంలోని కోనాపూర్ గ్రామం శ్రీరుక్మిణీ విఠలేశ్వర మందిరంతో పాటు కాద్లాపూర్ హన్మాన్ మందిరం, నాగారం గ్రామాల్లో వారం రోజులుగా కొనసాగుతున్న సప్తాహం సోమవారం ముగిసింది. రామనవమి పండుగను పురస్కరించుకుని ఆయా గ్రామాల్లో సప్తాహం ప్రారంభించగా, సోమవారం నిండుసర్వలు, మంగళహారతులు, దిండి ఊరేగింపుతో ముగిసింది. అన్నదానం చేశారు. మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాలకు చెందిన వార్కారి భక్తులు ఆలపిస్తున్న విఠల, విఠల, పాండురంగా విఠల, భజన సంకీర్తణలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

కమనీయం.. శివపార్వతుల కల్యాణం



నిజాంసాగర్(జుక్కల్) : మండలంలోని గోర్గల్ గ్రామంలో విఠలేశ్వర ఆలయ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం శివ పార్వతుల కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శివపార్వతుల కల్యాణానికి ఎంపీపీ పట్లోళ్ల జ్యోతి దుర్గారెడ్డి దంపతలు పట్టు వస్త్రాలను ఊరేగింపుగా తీసుకొచ్చారు. విఠలేశ్వర ఆలయ వార్షికోత్సవం సందర్భంగా సప్తహం కొనసాగుతుంది. ఆలయ వార్షికోత్సవాలు గణపతి ఉపాసకులు సంజీవ్‌రావ్‌శర్మ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

రాజగోపుర శిఖర ప్రతిష్ఠాపన ప్రారంభం



దోమకొండ : మండల కేంద్రంలోని చాముండేశ్వరి ఆలయ రాజగోపుర శిఖర ప్రతిష్ఠాపన ఉత్సవాలు సోమవారం ప్రారంభమాయ్యాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు యజ్ఞం, ప్రధాన కలశస్థాపన కార్యక్రమాలు నిర్వహించారు. 24వ తేదీ బుధవారం రాజగోపుర స్థిర యంత్ర ప్రతిష్ఠ, 25న కలశ మహకుంభాభిషేకాలు ఉంటాయి. 26న సామూహిక సత్యనారాయణ వ్రతం, 27న సంకష్ఠ గణపతి 8వ వార్షికొత్సవ పూజలు, అన్నదానం ఉంటాయి. 28వ తేదీ ఆదివారం సిద్ధిబుద్ధి సమేత సంకష్ఠ గణపతి ఊరేగింపు ఉంటుందన్నారు. జెడ్పీటీసీ సభ్యులు తీగల తిర్మల్‌గౌడ్, ఎంపీపీ శారద, మాజీ సర్పంచ్ అంజలి, సీడీసీ మాజీ చైర్మన్ ఐరేని నర్సయ్య, ఆలయ కమిటీ అధ్యక్షుడు పాలకుర్తి శేఖర్, ఆలయ అర్చకులు శరత్‌చంద్ర శర్మ తదితరులున్నారు.

వైభవంగా సరస్వతి విగ్రహం..



నిజాంసాగర్(జుక్కల్) : మండలంలోని అచ్చంపేట ఆదర్శ మోడల్ పాఠశాలలో సోమవారం సరస్వతి మాత విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చరణాలు, హోమ కార్యక్రమాలు, అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ చంద్రకళ, టీచర్లు విజయలక్ష్మి, అనురాధ, సవిత, స్వప్న, శారధ, దీప్తి, గిరిజ తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న రేణుక ఎల్లమ్మ ఉత్సవాలు



రాజంపేట : మండల కేంద్రంలో రేణుక ఎల్లమ్మ ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం యజ్ఞ హోమం, పుట్ట ధ్వని తరలించుట, గంగబోనం కార్యక్రమాలను నిర్వహించారు. మంగళవార రేణుక ఎల్లమ్మ కల్యాణం, ఎల్లమ్మకు బోనాలు తీసే కార్యక్రమాలు ఉంటాయని గౌడ సంఘ సభ్యులు తెలిపారు.

రైతులకు బోనస్ చెల్లించాలి



సీఎం రేవంత్‌రెడ్డికి రాసిన పోస్టుకార్డులను చూపుతున్న మాజీ ఎమ్మెల్యే సురేందర్



అంచనూరులో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్

రామారెడ్డి(ఎల్లారెడ్డి) : రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం క్వింటాలుకు రూ. 500 బోనస్ చెల్లించాలని ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే సురేందర్ సోమవారం డిమాండ్ చేశారు. రామారెడ్డి మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి ఆందోళన నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డికి రైతులు, బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి పోస్ట్‌కార్డులు పోస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ఇచ్చిన వాగ్దానాలు అమలయ్యే వరకు పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నారెడ్డి దశరథ్ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు మాజీ జెడ్పీటీసీ పడిగెలరాజేశ్వరరావు, , మండల పార్టీ అధ్యక్షుడు రంగు రవీందర్‌గౌడ్ ఉన్నారు.

రైతులను మోసగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

దోమకొండ : కల్లబొల్లి మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ రైతులను మోసం చేస్తుందని మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ అన్నారు. సోమవారం మండలంలోని అంచనూరు గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రంను ఆయన పరిశీలించారు. క్వింటాలు వరి దాన్యానికి రూ. 500 బోనస్ ఇస్తామని చెప్పి నేటికి ఇవ్వలేదన్నారు. ఇప్పటికి సగం మంది రైతులకు రైతుబంధు అందలేదన్నారు. సీజన్‌కు అనుకూలంగా రైతులకు రైతుబంధు ఇచ్చి ఆదుకోవాలన్నారు. వర్షానికి తడిసిన దాన్యంను కొనుగోలు చేయాలన్నారు. అంతకు ముందు గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు బీమరి రాములు ఇటీవల మరణించగా వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు మధుసూదన్‌రావ్, సీడీసీ మాజీ చైర్మన్ ఐరేని నర్సయ్య, నాయకులు గజవాడ శ్రీకాంత్ తదితరులున్నారు.

ఓటు హక్కుపై విద్యార్థుల ప్రచారం



కామారెడ్డి అర్బన్ : ఓటు అనేది పవిత్రమైందని, నిజాయితీ గల అభ్యర్థికి వేయడం ద్వారా ప్రజాస్వామ్యం విజయవంతం అవుతుందని తెయూ భిక్కనూర్ సౌత్ క్యాంపస్ సోషల్ వర్క్ విభాగం విద్యార్థులు అన్నారు. ఫీల్డ్ వర్క్‌లో భాగంగా సౌత్ క్యాంపస్ సోషల్‌వర్క్ విభాగం విద్యార్థులు సోమవారం కామారెడ్డి పట్టణం వడ్డెర కాలనీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో కలిసి కాలనీలో ఓటు హక్కు వినియోగంపై విద్యార్థులతో ఊరేగింపు నిర్వహించి అవగాహన, చైతన్యం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్‌మాస్టర్ జి.బాబయ్య, ఉపాధ్యాయులు స్రవంతి, సోషల్ వర్క్ విద్యార్థులు అఖిల, రాజశేఖర్ తదితరులున్నారు.

పిరమిడ్ పార్టీ అభ్యర్థి నామినేషన్



బాన్సువాడ : జహీరాబాద్ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థిగా పిరమిడ్ పార్టీ నుంచి మోహన్ రెడ్డి సోమవారం సంగారెడ్డిలో నామినేషన్ వేశారు. ఉత్తర తెలంగాణ పిరమిడ్ పార్టీ ఇన్‌చార్జి కొండని అంజయ్య ఆధ్వర్యంలో మోహన్‌రెడ్డి నామినేషన్ వేశారు. పత్రీజీ లక్ష్యం మేరకు శాఖాహారులే పాలకులు కావాలని, ఎన్నికల్లో ఆత్మజ్ఞానులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. తెలంగాణ వ్యాప్తంగా 12 చోట్ల ఎంపీ అభ్యర్థులు పోటీ చేస్తున్నారని అంజయ్య తెలిపారు.

ఆకాశంలో మేఘాలు.. అన్నదాత దిగాలు



ధాన్యంపై టార్పాలిన్లు కప్పుతున్న రైతులు

బాన్సువాడ రూరల్ : పంట చేతికొచ్చిందని మురిసిపోవాల్సిన రైతన్న, ఆకాశంలో కమ్ముకున్న దట్టమైన మేఘాలు, ఉరుములు, మెరుపులతో దిగాలు చెందుతున్నాడు. గత నాలుగైదు రోజులుగా ప్రతిరోజు సాయంత్రం కాగానే గాలిదుమారంతో పాటు చెదురు, మదురు వర్షం కురస్తుండటంతో నూర్పిడి చేసిన ధాన్యం పూర్తిస్థాయిలో ఆరడం లేదు. దీంతో ఎండకాయగానే ధాన్యాన్ని ఎండబెడుతున్న రైతులు, ఆకాశంలో మార్పులు చోటుచేసుకోగానే ఆగమేఘాలమీద కుప్పపేర్చి కవర్లు కప్పేపనిలో లీనమవుతున్నారు. యాసంగి పంట నూర్పిళ్లు 50శాతం పూర్తయి ధాన్యం కాంటా కాగా మరో 50శాతం ఇంకా కల్లాల్లోనే ఉన్నాయి. వారంరోజులు వర్షం గడువిస్తే అన్నదాత కష్టాల నుంచి గట్టెక్కే అవకాశం ఉంది.

జోరుగా కాంగ్రెస్ ప్రచారం





ఎల్లారెడ్డిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న సొసైటీ వైస్ చైర్మన్ ప్రశాంత్‌గౌడ్, రుద్రారంలో..

ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో సొసైటీ వైస్ చైర్మెన్ ప్రశాంత్‌గౌడ్ సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జహీరాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ షెట్కార్‌ను చేతి గుర్తుకు ఓటు వేసి గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రుద్రారంలో..

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : మండలంలోని పలు గ్రామాలలో కాంగ్రెస్ నాయకులు సోమవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. పార్లమెంటు ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థి సురేశ్ షెట్కార్‌ను మెజార్టీతో గెలిపించాలని వారు కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు సాయిబాబా, గోపి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో..



ఉపాధి కూలీల వద్ద..

లింగంపేట(ఎల్లారెడ్డి) : మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సురేశ్‌షెట్కార్ కు మద్దతుగా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. కాంగ్రెస్ పార్టీ చేతి గుర్తుకు ఓటేసి షెట్కార్‌ను గెలిపించాలని కోరారు. మెంగారం అయ్యపల్లి, శెట్పల్లి తదితర గ్రామాల్లో ఉపాధి పనులు చేస్తున్న కూలీల వద్ద ప్రచారం చేశారు. సంతోష్‌రెడ్డి, మోతె సర్పంచు రాంరెడ్డి, సాయికుమార్, కిష్టాగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

విద్యార్థినులకు కంటి పరీక్షలు



ఎల్లారెడ్డి : పట్టణంలోని కస్తూర్బా బాలికల గురుకుల పాఠశాలలో సోమవారం విద్యార్థినులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఆప్తాల్మిక్ వైద్యులు డాక్టర్ హరికిషన్ కంటి పరీక్షలు నిర్వహించి మందులను అందించారు.

ఎల్లారెడ్డిలో ఫిజియోథెరపీ క్యాంప్

ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి పట్టణంలోని భవిత కార్యాలయంలో సోమవారం ఫిజియోథెరపీ క్యాంప్ నిర్వహించారు. ఫిజియోథెరపీ వైద్యులు డాక్టర్ అరుణ్ చిన్నారులకు వైద్య పరీక్షలను నిర్వహించారు. ప్రతిరోజు వ్యాయామాలు చేయడం వల్ల అంగవైకల్యం దూరమవుతుందన్నారు. కార్యక్రమంలో సిబ్బంది వెంకటేశం, శివకుమార్ తదితరులున్నారు.

బైక్ షోరూంను ప్రారంభించిన ఎమ్మెల్యే



పిట్లం(జుక్కల్): మండల కేంద్రం అయిన పిట్లంలో టీవీఎస్ నూతన బైక్ షోరూంను సోమవారం ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు ప్రారంభించారు. అనంతరం కొనుగొలుదారులకు వాహనాలను అందజేశారు. అనంతరం ఈనెల 30న మహనీయుల జయంతి ఉత్సవాల కరపత్రాలను స్థానిక నాయకులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం మండలంలోని కంబాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త రమేశ్ ఇంటికి వెళ్లి ఆయన ఆరోగ్యపరిస్థితిని వాకబు చేశారు. బైక్ షోరూం యజమాని రాజు, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులపై ఒత్తిడి తేవొద్దు

కామారెడ్డి అర్బన్ : ఇంటర్ ఫలితాల విడుదల నేపథ్యంలో తల్లిదండ్రులు తమ పిల్లల మానసిక స్థితిపై దృష్టిపెట్టి గమనించాలని తెలంగాణ సైకలాజికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, సీనియర్ సైకాలజిస్ట్ డాక్టర్ ఎంఎ కరీం అన్నారు. సోమవారం ఆయన ఒక ప్రకటన చేశారు. సమస్య తీవ్రతను ఎదుర్కొలేని సమయంలో ఉచిత మానసిక సహాయం కోసం 9440488571లో సంప్రదించవచ్చన్నారు.

గుండెపోటుతో మాజీ సర్పంచ్ మృతి

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ జంగిరాజయ్య (50) గుండెపోటుతో మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. గతవారం రోజుల క్రితం రాజయ్యకు గుండె నొప్పిరావడంతో చికిత్సల నిమిత్తం కామారెడ్డిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వారు పేర్కొన్నారు.

పోచారంలో బోనాలు..

ఎల్లారెడ్డిరూరల్ (ఎల్లారెడ్డి) : మండలంలోని పోచారంలో సోమవారం బోనాల పండుగను నిర్వహించారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన గంగమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం పూర్తి కావడంతో గ్రామస్తులు అమ్మవారికి బోనాలను సమర్పించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.